# పరిష్కారం

చీకటి. డిసెంబర్ నెల. తెల్లవారుజాము. చలి. అల్లంత దూరంలో లైట్ల వెలుగు. కారు వస్తూ ఉంది.

పోలీసులు లేచి నిలబడ్డారు. చలికి వణకటం లేదు. కారాపారు. ఆగింది.

"ఏం గావాలి?" ఓనరు అడుగుతూ ఆవులించాడు.

'సారాయి!'

'నేనెవరో తెలుసా?" మగతగా ప్రశ్నించాడు.

'తెలుసు! మూర్తిగారు! అయినా మా డ్యూటీ మేం చేయాలికదా!'

ముగ్గురు పోలీసులూ మూడు డోర్లు తీసి లోపలికి వచ్చారు. మూశారు. చేతుల్లో తుపాకులు. సీటుల్లో కూర్చున్నారు.

'ఎవరు మీరు?'

తుపాకులు కనిపించాయి.

'కారు పోనీయ్!

తుపాకులు చెప్పాయి.

కారు స్టార్టు అయింది. రోడ్డు దిగింది. మలుపు తిరిగింది. కాలవగట్టు, చెట్టు.

ఓనరుకు మగత ఎగిరిపోయింది. డ్రైవరుకు చలిలో చెమట పట్టింది.

ఓనరు పేరు మూర్తి. కారు సొంతదారు. పొరుగూళ్ళో ఉంపుడు గత్తె ఉంది. పోయి వస్తున్నాడు. డ్రైవరు పక్కనున్న పోలీసు చెప్పినట్లు డ్రైవరు వింటున్నాడు. మూర్తి పక్కల



నున్నవాళ్ళు చెప్పినమాట మూర్తి వింటున్నాడు. వింటున్నాడు కదా అని చేతులు వెనక్కు విరిచికట్టారు.

ప్రతిఘటన లేదు. ప్రయత్నం లేదు. ప్రమాదం అర్థమయినట్లుంది.

అయిదుగురూ దిగారు. కారు డోర్లు వేశారు. లాక్ చేశారు.

డ్రైవరు కాళ్ళు చేతులూ, కట్టి, కాలవగట్టు మీద కూర్చోబెట్టారు. కాలవలో నీళ్ళు లేవు. కళ్ళలో ఉన్నాయి.

చెట్టు కిందరాయి, రాయి పక్క మనిషి. చేతిలో కత్తి. రాయి వధ్యశిల కాదు.

మూర్తిని రాయి మీద కూర్చోబెట్టారు.

"ఏం ప్రమాదం లేదు. తల గుండు గొరగటమే. కదిలితే మెడకాయమీద తలకాయ ఉండదు. కదలకపోతే బోడి గుండుంటుంది. నున్నగా, నిగనిగలాడుతూ, అందంగా హాయిగా, నీ ఇష్టం" పోలీసు చెప్పాడు.

రాతి మీది మూర్తి కదల్లేదు. అరవలేదు, పరిస్థితి అర్థమయింది. కళ్ళలో నీళ్ళు, కాలవలో నీళ్ళింకి పోయాయి.

"నోళ్ళు మూయం. ఎవరు అరిచినా చచ్చిపోతారు" పోలీసులు హెచ్చరించారు. వార్నింగు పని చేసింది.

తల గొరగటం, గడ్డం తీయటం, మీసాలు తుడవటం కనుబొమ్మలు తప్పించటం, చెవుల వెంట్రుకలు తొలగించడం - పూర్తయింది.

మెడపైన ముఖంలో వెంట్రుక జాడలేదు. తల బోర్లించిన పిడతలాగుంది.

మూర్తి భూతలింగంలా కూర్చున్నాడు. కదల్లేదు. మెదల్లేదు. కిక్కురుమంటే ఒట్టు!

పోలీసులు మర్యాదగా ఉన్నారు. వాళ్ళు నోళ్ళు మూయలేదు. చేయి చేసుకోలేదు.

కత్తి కూడా నెత్తురు ముఖం చూడలేదు.

డ్రైవరు అరవలేదు. బుద్ధిమంతుడైన బడిపిల్లవాడిలా కూర్చున్నాడు.

మూర్తి గుండుకు సున్నంబొట్టు పెట్టారు. పై పంచ, లాల్చీ, బనీను, మడతపెట్టి ఇచ్చారు. కట్టుకొన్న పంచ, ఖద్దరుది, పొందూరుది. పైకి ఎగదోపారు.

మూర్తిని కారు పైన లగేజి కేరేజి మీద కూర్చోబెట్టారు.

మెళ్ళో తాళ్ళేసి కేరేజికి నాలుగు పక్కలా లాగి బిగగట్టారు. కదిలితే ఆ తాళ్ళే గొంతుకు ఉరి అవుతాయి.

ఏసి కారు, ఏసి ఇల్లు, ఏసి పెళ్ళాం, ఏసి ఉంపుడు గత్తె, సొంతదారు మూర్తి చలిలో వణుకుతున్నాడు.

మనిషి ఉత్సవ విగ్రహంలాగా ఉన్నాడు. కోటప్పకొండ తిరణాల ప్రభలాగ కూర్చున్నాడు. కదలడు, మెదలడు, కడేరావు బందు!

డ్రైవరును అతడి సీటులో కూర్చోబెట్టారు. కట్లు కొంచెం వదులు చేశారు. కారు స్టార్టు చేయగలడు, నడపగలడు, ఆపగలడు.

'వినండి' అన్నారు పోలీసులు' ఎవరూ ఏడవకూడదు. అరవకూడదు. వాళ్ళు తలలూపారు.

కారు రచ్చబండ దాకా పోవాలి. అక్కడ ఆపాలి. ఇద్దరూ 'సరే' అన్నారు

'నోళ్ళు మూయాలి' వాళ్ళు మళ్ళీ కిక్కురుమనలేదు.

'కారు నెమ్మదిగా పోవాలి. నడచినంత నెమ్మదిగా' వాళ్ళు తలలూపారు.

'ఊళ్ళోకి చేరిన దగ్గర్నించి రచ్చబండదాకా కారు హారను వేస్తూనే ఉండాలి.'

వాళ్ళు అంగీకరించారు.

'మేం వెనకే వస్తుంటాం' వీళ్ళు చెప్పారు. వాళ్ళు విన్నారు. కారు బయలుదేరింది.

ఊరి మొగదలకు కారు వచ్చింది. జమ్మిచెట్టు దగ్గర పోలీసు దిరుసులో ఉన్న మనిషి ముందుకు వచ్చాడు. చెప్పాడు.

'హారను కొట్టటం మొదలు పెట్టు!' హారను అల్లకల్లోలంగా అరుస్తూ ఉంది.

విజయదశమి కోసం జమ్మిచెట్టు ఆకులవుతూ ఉంది. చెట్టుమీద శవాకారంలో, మళ్ళీ అవసరం వచ్చిందాకా, ఆయుధాలు విశ్రాంతి తీసుకోవచ్చు.

పోలీసు డ్రస్సులో ఉన్నవాళ్ళు మసక చీకటిని కప్పుకొని మాయమయ్యారు. తూర్పు తెల్లబడింది. కారు కదలుతూ ఉంది. పెళ్ళి నడక, నెమ్మదిగా కదలుతూ ఉంది. నత్తనడక, నల్లేరు మీద బండినడక, కారుకు చాలా నడకలు వచ్చు -

కారు హారనుకు కుక్కలు మొరుగుతున్నాయి. కుక్కల అరుపులకు పశువులు కదులుతున్నాయి. ఇంకా సూర్యోదయం కాలేదు.

ముసలీముతకా, పిల్లాజెల్లా చలిమంటలు వేసుకొంటున్నారు. గోలకటు చూస్తే కారు, కారు మీద మూర్తి, తలంతా గుండు, గుండు మీద సున్నం బొట్లు.

ముసలోళ్లు లేచారు, పిల్లోళ్ళు లేచారు. వాళ్లు లేచారు, వీళ్లు లేచారు, ఊరూవాడా లేచాయి. పొద్దుపొడవలేదు.

అందరికీ ఆశ్చర్యం. ఎవరి నోటివెంట మాటా లేదు. మౌనం. మౌనం మహాభాష్యం. మౌనం మహా సామ్రాజ్యం, రాజాజ్ఞ! ఉలుకులేదు, పలుకులేదు.

చుట్టూ గోల, హోరు. జనం నోరెత్తటం లేదు.

పెళ్లి పల్లకీలా కారు నిదానంగా నడుస్తూ ఉంది. పోజులు కొడుతూ ఉంది.

జనం నోరెత్తకుండా ప్రశ్నించుకొంటున్నారు.

ఇంత పరాభవమా? పెద్ద మనిషికి గుండుగీస్తారా? ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్లా?

ఎవరూ అడగలేరు, ఎవరూ సమాధానం చెప్పలేదు.

కారు పోతూ ఉంది. మౌనంలా, ఏరులా కాలంలా, జనం తీరులా.

కారు ఆపలేదు. ఎవరూ అడ్డం రాలేదు. ఏమీ అడగలేదు. ఏమీ చెప్పలేదు.

గుండు గీయటం పరాభవం. పరిష్కారం ఏమిటి. ఎవరు చెబుతారు?

ఎవరూ చెప్పలేదు.

పరాభవానికి పరిష్కారం నష్టపరిహారమా? కాదా? అవునా? నిశ్శబ్దం కారుగోల, కాకిగోల.

ఎంత నష్టపరిహారం? లక్షా? రెండా? మూడా? పాతికా? ఎంత ఇచ్చినా వచ్చిన అవమానం ఎలా పోతుంది?

ఇల్లు కట్టించి ఇస్తే - కొంతమేలే! ఐదెకరాలు పొలం ఇస్తే - మరికొంత మేలే!

ఉద్యోగం ఇస్తే - జీవితాంతం ఉంటుంది - ఇంకొంత మేలే!

ప్రభుత్వం ఈ పనులన్నీ చేయవచ్చు. కొన్నాళ్లయినా చేయవచ్చు. అంతమాత్రాన జరిగిన అవమానం ఎలా మారిపోతుంది? ఈ తలవంపులు ఎలా లేకుండా పోతాయి?

మా పొలం మీరాక్రమించుకొన్నారంటే ఇంతకోపం రావాలా? కొలిపిస్తే పోలా? సర్వేయరు వస్తే సరిపోలా? అన్యాయం అయిందంటే అంత అహంకారమా? నోరుంది కదా అని పొరుగువాడి పొలం గదుం కోవటమా? అంత కండకావరమా?

ఆలోచనలు కందిరీగలు. తుట్టె కదిపితే చెడగుడుతున్నాయి.

ఎంత చదువుకొంటే మాత్రం, ఎంత డబ్బుంటే మాత్రం, ఎంత కొవ్వెక్కితే మాత్రం, ఊరివాళ్ల ఆడపిల్లని వాడివాళ్ల మగపిల్లవాడు మాట అంటాడా? చేయి పట్టుకొంటాడా?

దానికేమిటి శిక్ష?

గుండు గీయాల్సిందే!

మాట అన్నాడా?- బుజువులేదు.

చేయిపట్టుకొన్నాడా? సాక్ష్యం లేదు.

నింద వేయటం, శిక్ష వేయటం - అంతా మీ వంతేనా?

మూర్తి తల తిరుగుతూ ఉంది.

మూర్తికి ఆస్తి ఉంది. అంతస్థు ఉంది. ఆరోగ్యం ఉంది. అధికారం ఉంది. నేరం ఒక్కదాని చేయి పట్టుకోవటమా?

పరాభవానికి పరిష్కారంగా ప్రభుత్వం తనకేమీ ఇవ్వనక్కరలేదు.

కానీ, అవమానానికి పరిష్కారం ఏమిటి? ప్రతీకారం ఏమిటి? అపరాధం చేయటం, ఆముతో అలా తప్పించుకొని పోవటమేనా?

మూర్తికి గుండె నొప్పిగా ఉంది. భయంగా ఉంది.

డ్రైవరుది స్వామిభక్తి. ఒక్క ఆలోచన లేదు. ఒక్కమాట లేదు. ఒక్క పనిలేదు. గుండు

గీయించిన వాళ్ల హెచ్చరిక గుండె గూటిలో గస్తీ తిరుగుతూ ఉంది. ప్రాణభయం.

శిక్షింపవలసింది కోర్టు. అది న్యాయం. అది ప్రభుత్వం పని. మరి ఈ శిక్ష ప్రభుత్వం పనా?

మనిషి శక్తి ఎంత ఘోరం! ఇంత పరాభవంగా శిక్షిస్తారా? మూర్తి సామాన్యుడా? సంపన్నుడే!

కుక్కలు మొరుగుతున్నాయి, జనం కారు వెంట వస్తున్నారు. మూర్తి ఎవరినీ చూడటంలేదు. అవమానం! కళ్లు మూసుకొన్నాడు.చలి, వళ్లు ముడుచుకొన్నాడు.

"ఏమయింది? ఏమయిందేమయింది? ఏమిటీ ఘోరం?ఎవరు చేశారీపని? ఏమిటీ ఘోరకలి?

బదులు చెప్పే నాథుడు లేడు!

కారు వాడ దాటింది. ఊరు చేరింది. ఎదురుగా రచ్చబండ. పక్కనే షామియానా, టెంటులో జనం, చుట్టూ సమ్మె నినాదాలు, సమ్మె జనం నిద్రలేస్తున్నారు.

టెంటులో రాత్రంతా మేల్కొని ఉన్నవాడు రామచంద్రుడొక్కడే! మిగతా సమ్మె జనం రాత్రి నిద్రపోయారు. ఉదయం లేస్తున్నారు.

సూర్యోదయమయింది. చలి తగ్గుతూ ఉంది.

టెంటు దగ్గర కారు ఆగింది. వాగి వాగి మోగి మోగి హారను ఆగిపోయింది.

రామచంద్రుడు లేచినిలబడ్డాడు. కారు మీద కూర్చున్న మూర్తిని చూశాడు.

రామచంద్రుడికి నెత్తిమీద జుత్తులేదు, మీసం లేదు, కనుబొమ్మలు లేవు. చెవుల్లో వెంట్రుకలు లేవు. మెడపైన తలమీద వెంట్రుక ఆచూకీ లేదు.

రామచంద్రుడు నిరాహారదీక్ష చేస్తున్నాడు. తనకు న్యాయం జరగాలని కోరుతున్నాడు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటున్నాడు పోలీసుల్ని నమ్మలేనంటున్నాడు. దళితుడంటే ఇంత అలుసా? అంటున్నాడు. 'మూర్తి డౌన్ డౌన్' అంటున్నాడు. ఆ నినాదాలు టెంటు చుట్టూ వేలాడుతున్నాయి.

రామచంద్రుడు నాలుగునాళ్ల నుంచి అన్నం తినలేదు. పచ్చి గంగ ముట్టలేదు. నాలుగు నాళ్ల వయస్సున్న జుత్తు. తల మీద మొలకెత్తుతూ ఉంది.

టెంటులో వాళ్లు కారు దగ్గరకు పోయారు. మూర్తిని దించారు. కట్లు విప్పారు. బట్టలు వేశారు. తల శుభ్రంగా తుడిచారు.

రామచంద్రుడు మూర్తిని చూశాడు. తన తల తడుముకొని మూర్తి తల చూశాడు. మీసం తాకి మీసం చూశాడు. గడ్డం పట్టుకొని, గడ్డం పరికించాడు. బొణతలు వెదికి బొణతలు చూశాడు. చెవులు పిండుకొని చెవులు చూశాడు. మూర్తి చెవులు పిండుకొంటున్నాడు.

ఇద్దరూ దగ్గరదగ్గరగా నిలబడ్డారు. చుట్టూ ఉన్న జనం చూస్తున్నారు. ఊరూ వాడా ఏకమయినట్లుంది. ఇద్దరూ ఒకే రకంగా అచ్చు గుద్దినట్లున్నారు.

మూర్తి నోరు తెరిచాడు.

'నిక్షేపంలాంటి మాగాణి ఐదెకరాలిస్తా?'

రామచంద్రుడు విన్నాడు. బిత్తరపోయాడు. వెంటనే చెప్పాడు. "నీ పొలం నాకువద్దు. నా పొలం నాకు చాలు, దాన్ని ఎవరూ ఆక్రమించుకోకపోతే చాలు. సర్వేయరు కొలిస్తే చాలు. నాది నాకు చాలు."

మూర్తి మళ్లీ అన్నాడు.

"నాచెల్లెల్ని నీకిచ్చి పెళ్లి చేయనా?"

'నీ చెల్లెలు నాకూ చెల్లెలే!' వెంటనే చెప్పాడు.

మూర్తి కళ్లలో నీళ్లు తిరిగాయి. అతడికన్నీరు మునుపు ఎప్పుడయినా చూశామని చెప్పగలవాళ్లు ఊళ్లోనేకాదు, మండలంలోనే కాదు, జిల్లాలోనే లేరు.

'నిన్ను అవమానించాను. నాది పొరపాటు, నన్ను క్షమించు!' మూర్తి అన్నాడో లేదో, రామచంద్రుడు కరిగిపోయాడు. కన్నీరయ్యాడు. 'నువ్వు అన్నవు - నేను తమ్ముణ్ణి, మనం సోదరులం' కన్నీళ్లలో శబ్దం తడిసి ముద్దయింది.

'సమ్మె ఆపేయవా?' మూర్తి అర్థించాడు.

రామచంద్రుడు షామియానా ఊడబెరుకుతున్నాడు.

★